# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **శాసనసభ సహా లోక్‌సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు అత్యధిక స్థాయిలో పోలింగ్‌లో పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.**

**2.** **పోలింగ్ ముగింపు సమయానికి క్యూలైన్లో ఉన్నవారందరికీ ఓటు వేసే అవకాశం ఉంటుదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు.**

**3.** **రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది.**

**4.** **సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటివరకు 23.10 శాతంపైగా పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది.**

**5.** **సీబిఎస్ఈ 12వ తరగతి ఫలితాలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఈరోజు ప్రకటించింది.**

==========================

శాసనసభ సహా లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు పోలింగ్‌లో పాల్గొనాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా మొదటిసారి ఓటు వేసేవారు తప్పనిసరిగా తమ హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ ఎన్నికలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరింత పెంచుతాయని ఆశిస్తున్నానన్నారు. అలాగే నాలుగో దశలో భాగంగా దేశవ్యాప్తంగా పోలింగ్ కొనసాగుతున్న అన్ని ప్రాంతాల్లోనూ ఓటర్లు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ప్రతిఒక్కరూ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష, సంస్కృతి, గౌరవాన్ని రక్షించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కోరారు.

--------------------------

పోలింగ్ ముగింపు సమయానికి పోలింగ్ కేంద్రం లోపల క్యూలైన్లో ఉన్నవారందరికీ కూడా ఓటు వేసే అవకాశం ఉంటుదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా తెలిపారు. మరోవైపు చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం బోరకమందలో తెలుగు దేశం పార్టీకి చెందిన ముగ్గురు ఏజెంట్లను నిర్బందించినట్లు వచ్చిన ఆరోపణపై జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసులు వెంటనే స్పందించ చర్యలు తీసుకున్నామని తెలిపారు. నిర్బంధిచిన ఏజెంట్లను పోలీసులు పీలేరులో గుర్తించి, వారిని వెంటనే విధులకు హాజరుపరిచామన్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోంది. ఓటర్లు వారి ఓటు హక్కు ను వినియోగించుకొనేందుకు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్ ల్లో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఎమ్.వేణుగోపాలరెడ్డి తెలిపారు. 372 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ సహాయంతో పర్యవేక్షిస్తున్నామన్నారు. ఏలూరు జిల్లాలోని 7 అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఉన్న 1744 పోలింగ్ కేంద్రంలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రశాంత వాతావరణంలో ప్రారంభమైనదని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో 415 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతపురం జిల్లాలో ఉదయం 7 గంటల నుండి పోలింగ్ పక్రియ ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 1032 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించగా ఇందుకోసం ప్రత్యేక కేంద్ర బలగాలు, పోలీస్ బందోబస్తు ను ఏర్పాటు చేస్తూ ప్రత్యేక నిఘా కెమెరాలను ఏర్పాటు చేశారు. వై ఎస్ ఆర్ జిల్లా ఎర్రగుంట్ల పట్టణంలోని జెడ్పి ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎస్.పి సిద్దార్థ్ కౌశల్ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు, క్యూ లైన్ పరిశీలించి సజావుగా, పారదర్శకంగా జరిగేలా విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ఇలా ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవాడలో రాజ్ భవన్ సమీపంలోని రైల్వే కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైయస్సార్ కడప జిల్లా భాకరాపురం పోలింగ్ కేంద్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దంపతులు ఓటు హక్కును వినియోగించుకోగా, తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నాయకులు నారా లోకేశ్ లు ఉండవల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ మంగళగిరిలో ఓటు వేశారు. రాజమహేంద్రవరం వీఎల్ పురంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఓటు వేశారు. ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలా వైయస్సార్ జిల్లా వేంపల్లెలోని ఇడుపులపాయలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్ కుమార్ మీనా విజయవాడలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

---------------------------

రాష్ట్రంలో శాసనసభతో పాటు లోక్ సభ ఎన్నికలకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అర్హత వున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఓటరుగా అర్హత పొంది ఓటరు గుర్తింపు కార్డు లేని వారు అందుకు ప్రత్యామ్నాయంగా ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించి ఓటు వేయవచ్చునని తెలిపింది. ఓటరు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అధికారుల వద్ద ఓటు వివరాలు సరిచూసుకున్న తరువాత బ్యాలెట్ యూనిట్ వద్దకు వెళ్ళాలి. బ్యాలెట్ పత్రంపై ఓటు వేయాలని నిర్ణయించుకున్న అభ్యర్థి పేరు వద్ద వున్న మీటను నొక్కాలి. ఈ మీటను నొక్కిన వెంటనే పక్కనే వున్న బాణం గుర్తులో ఎరుపు రంగు లైటు వెలిగి బీప్ శబ్దం వచ్చి వీవీప్యాట్‌లో ఓటు వేసిన అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు వివరాలతో ఉన్నచీటీ ఏడు క్షణాల పాటు మాత్రమే కనిపించి వీవీప్యాట్ యంత్రంలో పడిపోతుంది. ఆ సమయంలో ఆ చీటీని ఓటరు పరిశీలించి తాము వేసిన ఓటు సక్రమంగా పోలైందీ, లేనిదీ నిర్ధారించు కోవచ్చని

తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో లోక్ సభ, శాసన సభలకు ఏక కాలంలో ఎన్నికలు జరుగుతున్నందున రెండు బ్యాలెట్ యూనిట్లలో అభ్యర్థులకు వేర్వేరుగా ఇదే విధానంలో ఓటు వేయవలసి వుంటుందని పేర్కొంది.

---------------------------

రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. మొత్తం 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు ఓటింగ్ జరుగుతోంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం 11 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ లో 23.10 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. అత్యధికంగా బాపట్ల పార్లమెంట్ పరిధిలో 27.03 శాతం, అత్యల్పంగా అరకు పార్లమెంట్ పరిధిలో 16 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘ అధికారులు వెల్లడించారు. మరోవైపు తెలంగాణలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 11 గంటల వరకు తెలంగాణాలో 24 .31 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

---------------------------

సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఈరోజు ప్రకటించింది. బోర్డు పరీక్షల్లో 87.98 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని సీబీఎస్ఈ ఓ ప్రకటనలో తెలిపింది. గతేడాది కంటే ఉత్తీర్ణత శాతం 0.65 శాతం పెరిగిందని పేర్కొంది. 24 వేల మంది అభ్యర్థులు 95 శాతానికి పైగా మార్కులు సాధించగా, 1.16 లక్షల మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారని పేర్కొంది.

---------------------------

సుప్రసిద్ధ భారతీయ రచయిత, పద్మ విభూషణ్, పద్మభూషణ్ పురస్కారాల గ్రహీత ఆర్.కె. నారాయణ్ పేరుతో సుపరిచితులైన "రాసిపురం కృష్ణస్వామి అయ్యర్ నారాయణస్వామి వర్ధంతి" ఈరోజు. మాల్గుడి అనే ఒక కాల్పనిక పట్టణంలోని ప్రజలు, వారి ఆచార వ్యవహారాల గురించి ఆయన రాసిన ధారావాహిక నవలలు, కథలు ప్రజలను అమితంగా ఆకర్షించాయి. రచనా వ్యాసంగంలో ఆయన ప్రదర్శించిన ప్రతిభకు అనేక గౌరవ పురస్కారాలు లభించాయి. 1980 సంవత్సరంలో రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్ సంస్థ ఆర్.కె. నారాయణ్‌కు ఏ.సి.బెన్సన్ పతకంతో సత్కరించారు. 1906 అక్టోబర్ 10వ తేదీన జన్మించిన ఆయన... 2001 మే 13వ తేదీన కన్నుమూశారు.

---------------------------

ఎన్నికల సందర్భంగా సామాజిక మాధ్యమాలలో అసత్య సమాచారం ప్రచారం చేసే వారిని గుర్తించటానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని గుంటూరు జిల్లా ఎస్.పి తుషార్ దూడీ తెలిపారు. గుంటూరులో ఆయన మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమయ్యే అసత్య సమాచారం పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. జిల్లాలో ఎన్నికలకు 1915 పోలింగ్ కేంద్రాలకు నాలుగు వేలమంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశామని వివరించారు.

---------------------------

కృష్ణా జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ పిలుపు నిచ్చారు. ఎస్పీ నయీమ్ అస్మితో కలిసి నిన్న కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తీసుకున్న చర్యలు వివరించారు. సాయంత్రం 6 గంటల వరకూ ఓటు హక్కు వినియోగించుకోవచ్చుని, 6 గంటలకు క్యూలో ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయవచ్చున్నారు.

=======================